సాక్షి
వికారాబాద్

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



మూగజీవాల మృత్యువాత

అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 8లో ▸



మత్తు.. యువత చిత్తు!

మద్యం మత్తులో యువత చిత్తవుతోంది. వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. 8లో ▸



అయోమయంలో అన్నదాత

మూడు విడతల రుణమాఫీ ప్రక్రియ ముగిసినా ఇంకా అయోమయ పరిస్థితి వీడటం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

అనంతగిరుల్లో ట్రైనీ అధికారుల పర్యటన



వివరాలు నమోదు చేసుకుంటున్న ట్రైనీ ఎఫ్‌బీఓలు

అనంతగిరి: అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌ను తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ(దూలపల్లి)లో శిక్షణ పొందుతున్న 33మంది బీట్ ఆఫీసర్లు శనివారం సందర్శించారు. వృత్తి శిక్షణలో భాగంగా వారు జిల్లాలో పర్యటించారు. అనంతగిరుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, టూరిజం పార్కింగ్ ట్రెక్కింగ్ ఏరియా, వాచ్ టవర్, గ్రాస్ ల్యాండ్ ఏరియా మొదలైన వాటి గురించి స్టడీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. అటవీ భూముల సంరక్షణలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రధానమైన పాత్ర పోషిస్తారని తెలిపారు. ఒక్కో ప్రాంతంలోని అడవులకు ఒక్కో ప్రత్యేకత ఉంటుందని, దాన్ని బీట్ ఆఫీసర్లే గుర్తించాలన్నారు. అప్పుడే జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ పోస్ట్ డైరెక్టర్ సుభాష్ చంద్ర యాదవ్ పాల్గొన్నారు.

కల్తీకల్లు బాధితులకు న్యాయం చేయాలి

బీఆర్‌ఎస్ నేతల డిమాండ్



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మండలం పీరంపల్లిలో కల్తీకల్లు బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు అశోక్ మాట్లాడుతూ.. కల్తీకల్లు తాగడం వల్లే తాము అనారోగ్యం పాలయ్యామని స్వయాన బాధితులే చెబుతుంటే ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాత్రం తాగునీటి వల్లే ఇలా జరిగిందని చెప్పడం సరైంది కాదన్నారు. బాధితులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు ఎండీ గయాస్, ఎం రమేష్, పాండు, మహిపాల్ నాయక్, రాజు, భాస్కర్, మల్లేష్ యాదవ్, అంజి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ ఓపెన్ స్కూల్ జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 95028 63645లో సంప్రదించాలన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మోమిన్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ సిబ్బందితో యూటీఎఫ్ నాయకులు

మోమిన్‌పేట: సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇందుకు సమష్టిగా సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సమయ, పరమేష్, వసంత్, అశోక్, వెంకటయ్య, సర్దార్, ప్రభు, కృష్ణ పాల్గొన్నారు.

లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా మశ్చేందర్

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణంలోని బీఏఎం కళాశాలకు చెందిన అధ్యాపకుడు నీరటి మశ్చేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర లెక్చరర్స్ ఫోరం చైర్మన్ కత్తి వెంకటస్వామి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మశ్చేందర్‌ను అభినందించారు.



అర్చన నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీపతికి.. లక్ష తులసీదళార్చన

పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీపతికి శనివారం లక్ష తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలు, తులసీ దళాలతో అమ్మవారు, స్వామి వారి మూల మూర్తులకు విశేష అలంకరణ చేశారు. బ్రాహ్మణులు విష్ణు సహస్ర నామావళి పఠించారు. శ్రావణ మాసం మూడో శనివారం కావడంతో శ్రీవారికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేశారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రసాద నైవేద్యం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామివారికి తులసీలాలు సమర్పించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎన్‌సీసీ విద్యార్థులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని చితారు పేరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, చందన లేపనం, ఆకు పూజ చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి ఉదయం అభిషేకం నిర్వహించారు.

– కొడంగల్



తులసీదళాలతో మూలమూర్తి

ఆదర్శంగా నిలవండి

- వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులకు సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్ సూచన
- కొడంగల్ అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులు



మాట్లాడుతున్న సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్

కొడంగల్: ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి కార్యదర్శి కే మాణిక్ రాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని కడా కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, శిక్తా పట్నాయక్‌తో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గ ప్రజల నుంచి వివిధ సమస్యలపై 874 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అన్ని శాఖల అధికారులు రోజూ వారి కార్యక్రమాల్లో భాగంగా కొడంగల్ సమస్యలపై సమీక్ష చేయాలన్నారు. ఉద్యోగుల పని విధానంలో మార్పులు రావాలన్నారు. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రతిరోజూ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఆర్అండ్‌బీ, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. సెప్టెంబర్ 30 లోపు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని సమకూర్చాలని తెలిపారు.

గ్రీవెన్స్ యాప్‌పై శిక్షణ

కడా కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్ తెలిపారు. గ్రీవెన్స్ రిపోర్టులను తెలుసుకునేందుకు యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ యాప్ ద్వారా సమస్య స్థితిగతులు, సమస్య పరిష్కారం అయ్యింది లేనిది తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఎస్పీలు నారాయణరెడ్డి, యోగేష్ గౌతం, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, గరిమ నరుల, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

‘రాడార్’ ఏర్పాటుపై పునరాలోచించాలి

- ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి
- ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకట్రామయ్య

అనంతగిరి: జిల్లాలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును ప్రభుత్వం పునరాలోచించాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. శనివారం వికారాబాద్‌లోని ముద్ద వీర మల్లప్ప కన్వెన్షన్ హాల్‌లో అఖిల భారత రైతు కూలి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు కోసం 12 లక్షల చెట్లను కొట్టివేయాల్సి ఉంటుందని, ఇది పర్యావరణానికి ఎంతో ముప్పని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. అడవులను సంరక్షించాలని కోరారు. ప్రకృతికి హాని కలగని భూముల్లో రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలన్నారు. అన్నదాతల పాలిట శాపంగా మారిన ధరణి సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించడం కోసం ప్రత్యేక పాలసీని తయారు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వీ కోటేశ్వరరావు, మండల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు వై మహేందర్, నాయకులు డేవిడ్ కుమార్, నాగేశ్వరరావు, భూమన్న, సారంగపాణి, నరసయ్య మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

మోమిన్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీకి కట్టుబడి రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. పథకం అమలుకాని రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరి, ఆర్ఐ గోవర్ధన్, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్, నాయకులు నరోత్తంరెడ్డి, సిరాజుద్దీన్, మహేందర్ రెడ్డి, విఠల్, బగ్దాద్, సురేందర్, మహంతి స్వామి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పని చేద్దాం

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఉద్యోగికి తన సర్వీసులో బదిలీ అనేది సర్వసాధారణమని, ఎక్కడ పని చేసినా.. ఆయా ప్రాంతప్రజలతో మమేకం కావాలని కలెక్టర్ శశాంక అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, డీసీసీఓ ధాత్రి దేవి, జిల్లా పౌర సంబంధాల అధికారి పద్మశ్రీ, సివిల్ సప్లయ్ డీఎంఓ విజయలక్ష్మి ఇటీవల బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి వారిని సన్మానించారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఓ సునీల్, ఆర్డీఓలు సూరజ్‌కుమార్, అనంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుమాధవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు,ఉద్యానవన శాఖ అధికారి భాగ్యలక్ష్మి, డీసీసీఓ సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

‘పట్నం’ డిపోకు ప్రగతిచక్ర పురస్కారం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందింది. రాష్ట్రస్థాయిలో ఇచ్చే ప్రగతిచక్ర పురస్కారాల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. డిపో ఖర్చులు తగ్గిస్తూ.. ఆదాయాన్ని పెంచుతూ.. ఉద్యోగు లకు విధి నిర్వహణపై అవగాహన పెంపొందిస్తూ.. ఆర్టీసీని అన్నివిధాలా ప్రగతి పథంలో ముందుకు నడిపించే డిపోకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. నగరంలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో రోడ్డు, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప పురస్కారం అందుకున్నారు. రూ.2.50 లక్షల నగదు చెక్, షీల్డ్‌ను బహూకరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటనర్సప్ప మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు, డిపో ఉద్యోగుల కృషి ఫలితంగానే పురస్కారం దక్కిందని అన్నారు. కార్యక్రమంలో జేహెచ్‌జేడ్‌ఈడీ వీర్లపల్లి వెంకటేశ్వర్లు, ఆర్ఎం బి.వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డువస్తున్నాడని అంతమొందించాడు

- బీటెక్ విద్యార్థి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితులకు రిమాండ్



నిందితులను చూపిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: ప్రేమించిన యువతి వద్ద తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నాడన్న అనుమానంతో.. అన్నింటికీ అడ్డు తగులుతున్నాడన్న అక్కసుతో బీటెక్ విద్యార్థి ప్రశాంత్‌ను హత్య చేసినట్లు బాలాపూర్ పోలీసులు నిర్ధారించారు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏరుపాలెం మండలం అయ్యవారిగూడెంకు చెందిన మొండ్రు శాంతయ్య, అనిత దంపతులు 20 ఏళ్ల క్రితం బాలాపూర్‌కు వలస వచ్చారు. వీరి కుమారుడు ప్రశాంత్ (21) ఎంవీఎస్ఆర్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బాలాపూర్ గ్రామానికి చెందిన పాలు విక్రయించే పోచబోయిన మాధవ్ యాదవ్ (24) ఇతనికి స్నేహం కుదిరింది. ప్రతి విషయాన్ని షేర్ చేసుకునే వీరి మధ్య తరచూ చిన్నచిన్న తగాదాలు జరుగుతుండేవి. ప్రశాంత్ ఎప్పటికప్పుడు అన్నీ మరిచిపోయినప్పటికీ మాధవ్ మాత్రం మనసులో ఉంచుకొనేవాడు. చివరికి తన స్నేహితులైన నాదర్‌గుల్‌కు చెందిన చింతల మహేశ్ యాదవ్ (25), రామోజు సుమంత్ చారి (21), బాలాపూర్‌కు చెందిన నల్లపూసల మహేశ్ (24), దొడ్డి హరీష్ (23), మాడపురం అఖిల్ కిరణ్ కుమార్ (20), నాదర్‌గుల్‌కు చెందిన కోహెడ యశ్వంత్(19)తో కలిసి మట్టుబెట్టాడు. నిందితులపై హత్య, ఆయుధ దుర్వినియోగం, ఎస్సీ,ఎస్టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

నలుగురు తన వైపే చూడాలనే నైజంతో..

మాదవ్ యాదవ్ నలుగురిలో తనకంటూ ప్రత్యేకత ఉండాలని ఎప్పుడూ కొంతమందిని వెంటేసుకొని తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమాయణం కొనసాగిస్తున్నాడు. గంజాయి, సిగరెట్లు, మద్యం తాగుతాడని ప్రియురాలి ముందు ప్రశాంత్ తనను తక్కువగా చేశాడన్న అనుమానాన్ని మనసులో పెట్టుకున్నాడు. స్నేహితుడితో కలిసి మెలిసి ఉంటూనే అదును చూసి అంతమొందించాలనుకున్నాడు. స్థానికంగా ఫేమస్ కావాలని, అందుకు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా ఎవరినైనా మర్డర్ చేస్తానంటూ తరచూ స్నేహితులతో చెప్పుకోవడం ప్రారంభించాడు. దీనికి తోడు ఇటీవల ఓ ఫ్లెక్సీ విషయంలోనూ ప్రశాంత్, మాధవ్ మధ్య గొడవ జరిగింది. తనకు అన్ని రకాలుగా అడ్డువస్తున్న ప్రశాంత్‌ను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ముందస్తు పథకంలో భాగంగా గంజాయి, మద్యం సేవించి ఈ నెల 22న సాయంత్రం గణేశ్ చౌక్ సమీపంలోని మండి హోటల్‌కు మాధవ్, మహేశ్, సుమంత్ వచ్చారు. పాన్ షాప్ వద్ద సిగరెట్ తాగుతూ పాత గొడవలను గుర్తు చేస్తూ ఒక్కసారిగా మాధవ్ తనతో తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతి భాగాల్లో పొడిచాడు. మహేశ్, సుమంత్‌లు చేతులతో దాడి చేశారు. మిగిలినవారు సమీపంలో వారికి మద్దతుగా కాపుకాశారు. హత్య అనంతరం కుర్మల్‌గూడలో తలదాచుకున్న నిందితులను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కత్తి, రక్తపు దుస్తులు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీగా శివప్రసాద్



బంట్వారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జోనల్ సెక్రటరీగా జెడ్పీహెచ్‌ఎస్ కోట్‌పల్లి ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన సమావేశంలో పెద్దేముల్ జోనల్ సెక్రెటరీగా శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కోట్‌పల్లి, ధారూరు, పెద్దేముల్ మూడు మండలాల పరిధిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ జోనల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో జరుగుతాయి.

నాపరాతి గనుల్లో కేబుల్స్ చోరీ

నిందితులకు రిమాండ్

తాండూరు రూరల్: నాపరాతి గనుల్లో చోరీకి పాల్పడిన నిందితులను శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కరన్‌కోట్ శివారులోని బసప్ప, దుర్గప్పలకు చెందిన నాపరాతి గనుల్లో విద్యుత్ వైర్లు, వన్ హెచ్‌పీ మోటారును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన రాములు, జగ్గప్పలను పోలీసులు విచారించగా నేరం ఒప్పుకొన్నారు. చోరీ సొత్తును కర్ణాటక రాష్ట్రంలో అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

గడ్డి మందు పిచికారీ చేసిన మేత మేసి..

రెండు కాడెడ్లు, ఓ ఆవు మృతి



ఎద్దు కళేబరం

తాండూరు రూరల్: గడ్డి మందు పిచికారీ చేసిన మేత మేసిన రెండు కాడెడ్లు, ఓ ఆవు మృత్యువా తపడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు ఆనంద్ రోజు మాదిరిగానే తన వద్దనున్న రెండు కాడెడ్లు, ఒక ఆవును మేతకు తీసుకెళ్లాడు. గ్రామానికి చెందిన పెద్ద నర్సింలు తన వ్యవసాయ పొలంలో గడ్డి మందు పిచికారీ చేశాడు. అదే పొలంలో పశువులు మేయడంతో అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాయి. దీంతో బాధిత రైతు ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

మూగ జీవాల మృత్యువాత

- అంతుచిక్కని వ్యాధితో గొర్రెలు, మేకలు మృతి
- ఆందోళన చెందుతున్న కాపర్లు
- వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆరోపణ





ఇటీవల మృత్యువాత పడిన గొర్రెల కళేబరాలు

నవాబుపేట: అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రైతులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాల్సిన పశువైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో నష్టపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని నారెగూడ గ్రామంలో వారం రోజులుగా గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. పశువైద్య సిబ్బందికి ఫోన్ చేస్తే మూడు రోజుల క్రితం ఒకరు వచ్చి మందులు ఇచ్చి వెళ్లారు. అనంతరం మరో మూడు గొర్రెలు మృతి చెందాయని బాధితుడు రవీందర్ తెలిపాడు. వారం రోజుల్లో ఏడు గొర్రెలు మృతి చెందగా మరో 40 అస్వస్థతతో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. మూడు రోజులుగా ఫోన్లు చేస్తున్నా పశువైద్య సిబ్బంది నుంచి స్పందన కరువైందని ఆరోపిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పశువైద్యాధికారికి ఫోన్ చేసి చెప్పగా మా సిబ్బందిని పంపిస్తామని తెలిపారని.. ఇదే విషయం మీడియాకు వెల్లడిస్తానని చెప్పడంతో శనివారం ఉదయం వైద్యాధికారి శ్రీప్రియ వచ్చి గొర్రెలను పరిశీలించిందన్నాడు. లివర్‌టానిక్ ఇచ్చారని.. పెద్ద డాక్టర్లను సంప్రదించి ఎందుకు చనిపోతున్నాయో తెలుసుకుంటామని వెళ్లారని బాధితుడు తెలిపారు. గ్రామంలో ఇటీవల మరో రైతు వద్ద ఒక మేక అకారణంగా మృతి చెందగా రూ.60 వేలు విలువచేసే గేదె సైతం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కబేళాకు ఇచ్చినట్లు సమాచారం . పశువైద్యుల నిర్లక్ష్యంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.

చిటికె రోగం కారణంగా..

ఈ విషయమై పశువైద్యాధికారిని వివరణ కోరగా చిటికె రోగం వల్ల జీవాలు మృత్యువాత పడుతున్నాయని.. ఈ సీజన్‌లో గొర్రెలు, మేకలు తిన్నగడ్డి తొందరగా జీర్ణం కాకపోవడంతో ఇలా జరుగుతుందని తెలిపారు. గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మా సిబ్బందిని పంపామన్నారు. తాను సైతనం జీవాలను పరిశీలించి వైద్యం చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



లక్ష్మమ్మ(ఫైల్)

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జైపాల్ రెడ్డి తెలిపిన ప్రకారం.. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన జెట్టూరి లక్ష్మమ్మ(42) ఈ నెల 19న సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం భర్త వెంకటయ్య ఇంటికి రాగా భార్య కనిపించలేదు. శనివారం వరకు వెతికినా భార్య ఆచూకీ తెలియకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బండవెల్కిచర్లలో మైనర్..

కుల్కచర్ల: బాలిక అదృశ్యమైన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జైపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బాలిక(17) ఈనెల 21న రాత్రి సుమారు 11గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ముసలి రవిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి బలవన్మరణం



బాలకిష్టయ్య (ఫైల్)

దోమ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చంఎదిన బాలకిష్టయ్య(58) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇద్దరు కుమారులతో కలిసి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఆయన ఆరోగ్య పరిస్థితి ఇబ్బందిగా మారడంతో పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన్ను పరిగి ప్రభుత్వాస్పత్రికి తలరించారు. అక్కడ నుంచి వికారాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి..

బంట్వారం: మద్యం మత్తులో బావిలో దూకిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిదిలోని బస్వాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఎస్.ఏలియా (53) భార్యను వదిలేసి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ఏలియా బొప్పునారం సమీపంలోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లాడు. బావిలో దూకి ఊపిరాడక చనిపోయాడు. శనివారం మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేపే శ్రీకృష్ణాష్టమి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం ఏడు గంటలకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ చెప్పారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని యాదవులు పెద్దెత్తున తరలివచ్చి విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాటరాయుళ్లను పట్టుకున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: ఐదుగురు పేకాటరాయుళ్లను శనివారం యాలాల పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామంలో పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాధితులతో స్నేహంగా మెలగండి

- వైద్య సేవల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



తిమ్మాపూర్ సబ్‌సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ విజయలక్ష్మి

కొత్తూరు: ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని షాద్‌నగర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం ఇన్ముల్‌నర్వ, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల్లోని వ్యాధి నిరోధక టీకా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది, రోగులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే వారి ఇబ్బందులను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. స్థానికంగా వైద్యం అందుబాటులో లేని ఎడల ఎక్కడికి వెళ్లాలో సూచించాలని చెప్పారు. ఆశలు, ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వర బాధితులను గుర్తించి వెంటనే వైద్య సేవలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్‌సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్‌కుమార్, ఝాన్సీ, మానస, సిబ్బంది నాగేశ్, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పహాడీషరీఫ్: బీ ఫార్మసీ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన నాయిని వెంకటేశ్ కుమార్తె అక్షయ (19) ఇబ్రహీంపట్నంలోని శ్రీ దత్తా కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న యువతి ఐదు రోజులుగా ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 20న కుటుంబ సభ్యులు పనిమీద బయటికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా అక్షయ కనిపించలేదు. తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన తరుణ్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బోనాలు సంస్కృతికి ప్రతీక



కాటమయ్య ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

- ఆలయాల అభివృద్ధికి కృషి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కాటమయ్య బోనాల పండుగ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, నాయకులు సత్యంయాదవ్, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కేశవులుగౌడ్, మహేందర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనుగౌడ్, శివగౌడ్, రమేశ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, చిన్నాగౌడ్, కొండల్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటయ్యగౌడ్, ఎర్ర సత్యనారాయణగౌడ్, అంజయ్యగౌడ్, యాదయ్యగౌడ్, జగదీశ్,అశోక్, రాములు, చంద్రయ్యగౌడ్, భిక్షపతి, జహంగీర్‌అలీ, హీరాసింగ్, షాబుద్దీన్, తులసీరాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



మొగ్గదశలో అడవినాభి



ఎరుపు, పసుపు వర్ణంలోకి మారిన పూవు



ఎరుపు వర్ణంలోకి మారిన పుష్పం



పూర్తిస్థాయిలో వికసించిన పుష్పం

గ్లోరియోసా సూపర్బ్

గ్లోరియోసా సూపర్బ (అడవినాభి) మొక్కలు, పుష్పాలు ధారూరు అటవీ ప్రాంతంలో కనువిందు చేస్తున్నాయి. వర్షకాలంలో అటవీ ప్రాంతం, పొలంగట్లపై పుష్పించే ఈ మొక్కలు శనివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. – ధారూరు

మదీనా మసీదులోనే తేల్చుకొందాం



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

- తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కమల్‌అతహర్, ఖాలీద్‌సైఫుల్లా

తాండూరు: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించిన మదీనా మసీదులోనే సమస్యను పరిష్కరించుకుందామని సంఘం అధ్యక్ష కార్యదర్శులు కమల్‌అతహర్, ఖాలీద్‌సైఫుల్లా అన్నారు. శనివారం వారు సంఘం భవనంలో సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ఐక్యతగా పనిచేసిన అసోసియేషన్ గౌరవం గొడలవలతో సన్నగిల్లుతోందన్నారు. తమదే అసలైన సంఘం అని చెప్పుకొంటున్న వారు కార్యాలయ భవనానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇటీవలే సంఘం భవనం సమీపంలోనే వారు మరో కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. సంఘం ఆధీనంలో ఉన్న దుకాణ సముదాయాన్ని వక్ఫ్‌బోర్డుకు కట్టబెట్టేందుకు చీలిక వర్గం యత్నిస్తోందన్నారు. రెండు దశాబ్దాలుగా మత పెద్దలు చందాలు పోగు చేసి దుకాణ సముదాయం నిర్మించారన్నారు. చీలిక వర్గంలో ఉన్న హాదీశాహెరీ రూ.11లక్షలను దుకాణాలను నిర్మించేందుకు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పటి అధ్యక్షుడు అబ్దుల్ అహద్‌వెంటనే రూ.8లక్షలు తీసుకొన్నారని ఆరోపించారు. దుకాణ సముదాయం నుంచి వచ్చే అద్దెలతో పేద ముస్లింలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమాలు చేపట్టడమే తమ అభిప్రాయమన్నారు. తాము ఎన్నికైన నాటి నుంచి సంఘం ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. విద్యార్థులకు కోచింగ్ సెంటర్‌లను నిర్వహించి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో సంఘం ప్రధాన పాత్ర పోషించిందన్నారు. గతంలో కమిటీ రిజిస్ట్రేషన్ చేయిస్తామని అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు సభ్యుల నుంచి సంతకాలు తీసుకుని మోసం చేశారని గుర్తు చేశారు. దశాబ్దాల పాటు పదవులు కొనసాగించిన వ్యక్తులు రచ్చకెక్కడం సరికాదన్నారు. తమ వల్ల సమస్యలుంటే మదీనా మసీదులో సామరస్యంగా పరిష్కరించుకొందామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ అహద్, ప్రతినిధులు తాహేర్ ఖురేషి, లియాఖత్‌అలీ, ఆసిఫ్‌అలీ, సాధిక్, నిజామ్, వాహీద్, సలీమ్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తతో వృద్ధురాలికి గాయాలు

కేశంపేట: ఆర్టీసీ బస్సు దిగుతున్న ఓ వృద్ధురాలు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన ఢిల్లీ సత్యమ్మ షాద్‌నగర్ నుంచి గ్రామానికి వెళ్తోంది. ఈ క్రమంలో కేశంపేటలో వైఎస్సార్ చౌరస్తా బస్టాప్‌లో బస్సు దిగుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు కదిలించాడు. దీంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆమెకు కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును కేశంపేట ఠాణాకు తరలించారు.

మత్తు.. యువత చిత్తు

- మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న యువకులు
- మత్తులో గొడవలు, దాడులకు పాల్పడుతున్న వైనం
- అమ్డాపూర్‌లో వరుస ఘటనలు
- యువత దారి తప్పుతోందని పలువురి ఆందోళన



మొయినాబాద్: మద్యం మత్తులో యువత చిత్తవుతోంది. మద్యానికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా ప్రమాదాలతో ఇతరుల ప్రాణాలమీదకి తెస్తున్నారు. మత్తులో మునిగిన కొంత మంది యువత అనవసర గొడవలు, దాడులకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఐదు రోజుల్లో మండల పరిధిలోని అమ్డాపూర్‌లో జరిగిన రెండు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మత్తులో యువత దారి తప్పుతుందనడానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

కాపుకాసి దాడికి పాల్పడిన అన్నదమ్ములు

మొయినాబాద్ మండలం అమ్డాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం నారాయణ బంధువుల వద్దకు వెళ్లడంతో కిరాణా షాపులో అతని కొడుకు యశ్వంత్ ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు వంశీధర్, శశిధర్ రాత్రి 9 గంటల సమయంలో కిరాణ షాపుకు వెళ్లి మద్యం కావాలని అడిగాడు. షాపులో లేదని యశ్వంత్ చెప్పడంతో అప్పటికే మద్యం సేవించి ఉన్న అన్నదమ్ములు బండ బూతులు తిట్టారు. యశ్వంత్ తన తండ్రికి ఫోన్‌చేసి విషయం చెప్పడంతో అక్కడే ఉన్న అన్నదమ్ములు ఫోన్‌లో నారాయణను సైతం తిట్టారు. అంతటితో ఊరుకోని అన్నదమ్ములు ఈసీ వాగు బ్రిడ్జి వద్ద నారాయణకోసం కాపుకాశారు. రాత్రి 10 గంటల తరువాత నారాయణ, అతని భార్య కారులో వస్తుండగా బ్రిడ్జి వద్ద కారును అడ్డగించే ప్రయత్నం చేశారు. గమనించిన నారాయణ తప్పించుకుని ముందుకు వచ్చాడు. వెంటనే బైక్‌పై వెండించిన అన్నదమ్ములు రక్షమైసమ్మ ఆలయం ఎదుట స్పీడ్ బ్రేకర్ వద్ద కారు స్లో కాగానే బైకును అడ్డంగా పెట్టారు. నారాయణపై దాడి చేశారు. అతని భార్యపై సైతం చేయిచేసుకున్నారు. గమనించిన కొంత మంది యువకులు వచ్చి వారిని అడ్డుకున్నారు. ఆ రోజు నుంచి ఇద్దరు అన్నదమ్ములు పరారీలో ఉన్నారు. నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయంతో హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదు.

మద్యం మత్తులో కారు నడిపి..

అమ్డాపూర్ గ్రామానికి చెందిన యువకుడు శ్రీఖర్‌రెడ్డి మద్యం మత్తులో కారునడిపి బీభత్సం సృష్టించాడు. గురువారం రాత్రి అమ్డాపూర్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డికి చెందిన కారులో శ్రీఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి వెళ్తున్నారు. మద్యం మత్తులో ఉన్న శ్రీఖర్‌రెడ్డి కారు నడుపుతున్నాడు. హైస్కూల్ గేటు ఎదుట స్పీడ్ బ్రేకర్ వద్ద వేగంగా కారు నడిపి పక్కనే కిరాణాషాపు ముందు ఉన్న కూల్‌డ్రింక్స్ కేసులు, స్కూటీని ఢీకొట్టి, అదే వేగంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న రాంరెడ్డిని ఢీకొట్టారు. కారును ఆపకుండా వేగంగా పారిపోయారు. తీవ్ర గాయాలైన రాంరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును ఇప్పటి వరకు పరిశీలించలేదు.

గ్రామాల్లోనూ గంజాయి

అమ్డాపూర్‌లో జరిగిన వరస ఘటనలకు మత్తే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహిస్తుండడంతో యువత మద్యానికి బానిసలవుతున్నారని వాపోతున్నారు. గంజాయికి సైతం అలవాటు పడి నిత్యం మత్తులో ఉంటున్నారని.. గ్రామాల్లో వీటిని కట్టడి చేయడానికి పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలో జరిగిన రెండు ఘటనల్లోనూ యువకులు మద్యం మత్తులోనే ఉన్నారని.. వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో బెల్టుషాపులను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఎవరైనా బెల్టు షాపు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. అమ్డాపూర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఘటనలకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా చూస్తాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్